# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 29 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 22

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



# ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర సహకారం

## తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లకు సీఎం విజ్ఞప్తి

### ప్రధానమంత్రి గ్రామీణ గృహ పథకం కింద కేటాయింపులు కోరిన సీఎం

తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రికి ఆహ్వానం



**తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం కింద 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్య మంత్రి, రాష్ట్రంలో పేదలకు సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పనిచేస్తోందని వివరించారు.**

న్యూఢిల్లీ, జూలై 28: గత ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవ డంతో గ్రామీణ ప్రాంతాల్లో గృహాల అవసరం గణనీ యంగా పెరి గిందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్వ హించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు పేర్కొంటూ, వీలైనంత త్వరగా ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ఉపాధి, జీవనోపాధి కార్యక్రమంలో (మిగతా 2వ పేజీలో)

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం



### ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించిన పొన్నం ప్రభాకర్

### వినతులపై అధికారులతో నేరుగా మాట్లాడి ఆదేశాలు

### భూ సమస్యలు, ఇళ్లు, సంక్షేమ ఫిర్యాదులపై సమీక్ష

హైదరాబాద్, జూలై 28

ప్రజల సమస్యలను వేగంగా పరిష్క రించి వారికి సమర్థవంతమైన పాలన అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, బీసీ సంక్షేమం మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవా రం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి పరిశీలించి ప్రజల

(మిగతా 2వ పేజీలో)




# రైతునే రాజుగా తీర్చిదిద్దే రైతునేస్తం

## వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**రాష్ట్ర రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను చేరవేయడం, శాస్త్రవేత్తల సలహాలను నేరుగా అందుబాటులోకి తీసుకురావడమే రైతునేస్తం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించిన రైతునేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,600 రైతువేదికల ద్వారా లక్షలాది మంది రైతులు ప్రత్యక్షంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రైతునేస్తం రైతులకు ఎంతో ఉపయోగకరమైన డిజిటల్ వేదికగా నిలిచిందన్నారు.**

– హైదరాబాద్, జూలై 28: రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం కల్పించడం దేశంలోనే వినూ త్న ప్రయత్నమని ప్రశంసించారు. ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు, అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉ ందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రతి రైతువేదికను విజ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దడంలో అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని (మిగతా 2వ పేజీలో)



## రాష్ట్రపతిపై పుస్తకాల ఆవిష్కరణ

### రాష్ట్రపతి భవన్‌లో ఆవిష్కరణ కార్యక్రమం

### ఉపరాష్ట్రపతి చేతుల మీదుగాతొలి ప్రతుల విడుదల

### రాష్ట్రపతి భవన్ విశిష్టతను చాటే ఐదు ప్రచురణలు

న్యూఢిల్లీ, జూలై 28

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీకాలానికి సంబం ధించిన ప్రత్యేక ప్రచురణల తొలి ప్రతులను రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రాష్ట్రపతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రచురణలను ఆయన అధికారికంగా ఆవిష్క రించారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్ కూడా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి (మిగతా 2వ పేజీలో)

# నెరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి



### గంధం గోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన కల్వకుంట్ల కవిత

### బాధ్యులపై చర్యలు, బాధితులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్

### ఎస్సీ కమిషన్ నివేదిక విడుదల చేయాలని కోరిన తెలంగాణ రక్షణ సేన చీఫ్

**నెరేళ్ల ఘటనలో మృతిచెందిన గంధం గోపాల్ కుటుంబ సభ్యులను తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మంగళవారం పరామర్శించారు. నెరేళ్ల ఘటన తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన అని పేర్కొన్నారు. ఆ ఘటన జరిగి న సమయంలో అధికారంలో ఉన్న కుటుంబంలో తాను కూడా సభ్యురాలినేనని, అందుకు బాధిత కుటుంబాలకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు.**

రాజన్న సిరిసిల్ల, జూలై 28

నెరేళ్ల ఘటనలో పోలీసుల దాష్టీకానికి పాల్పడిన వారిపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు. అలాగే ఇసుక వ్యాపారంలో ధనదాహంతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. బాధ్యులైన పోలీ సు అధికారులు, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జాతీయ ఎస్సీ కమిషన్ విచారణ జరిగి నప్పటికీ ఇప్పటి వరకు నివేదిక వెలువడ లేదని కవిత పేర్కొన్నారు. ఆ నివేదికను వెంటనే విడుదల (మిగతా 2వ పేజీలో)



## 500 స్పెషలిస్ట్ డాక్టర్ల ఫలితాలు విడుదల

### నాలుగు విభాగాల్లో నియామకాలకు తుది జాబితా ప్రకటింపు

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తగ్గింపే లక్ష్యం

### మంత్రి దామోదర్ రాజనర్సింహ



# నగరంలో భారీ వర్షం

### లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం

### ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం



## పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

గతంలో జరిగిన తప్పులపై వివరణ ఇవ్వాల్సిందే మహిళా బిల్లుతో డీలిమిటేషన్ చేర్చి గందరగోళం చేస్తున్నారు అధికారంలోకి రాగానే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తాం మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



## పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పొంగులేటి ఆరా

### కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి

# పరీక్షల సంస్కరణల బిల్లుకు మద్దతు ఇస్తాం

న్యూఢిల్లీ: మంచి ఉద్దేశంతో పరీక్షల సంస్కరణల బిల్లు తీసుకొస్తే బీఆర్ఎస్ మద్దతు ఇచ్చి స్వాగతిస్తుందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిల్లులు తీసుకురావడానికి ముందు గత తప్పుల నుంచి ఏమి నేర్చుకుందో ప్రజలకు చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ఐదుసార్లు పేపర్ లీక్‌లు జరిగాయని.. అందులో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా మూడుసార్లు జరిగాయని వివరించారు. ప్రస్తుతం దేశానికి జవాబుదారీతనం, పారదర్శకత , దీర్ఘకాలిక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. డా. కె. రాధాకృష్ణన్ కమిటీ సిఫార్సుల అమలు ఏమైందో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అలాగే నందన్ నీలేకని కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఇప్పటికే పార్లమెంట్ ఆమోదించింది.. అయితే దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టి రాజకీయ గందరగోళం సృష్టించారని విమర్శించారు. డీలిమిటేషన్‌పై ఇప్పటివరకు ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకు రాలేదని వివరించారు. అందుకు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ఉదాహరణ అని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో లోక్‌సభ స్థానాలు పెంచాలని చట్టంలో ఉన్నప్పటికీ, 12 ఏళ్లుగా అవి అమలు కాలేదన్నారు. పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్నే అమలు చేయని ప్రభుత్వం.. కొత్త హామీలను ప్రజలు ఎలా నమ్ముతారని సందేహం వ్యక్తం చేశారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన జరగాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 1971 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్‌ను నిలిపివేసి, ఆ తర్వాత వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఆ గడువును పొడిగించిందని వివరించారు. ఈ కాలంలో దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని.. కానీ ఉత్తర భారతంలోని రాష్ట్రాల్లో జనాభా అధికంగా పెరిగిందని సోదాహరణగా తెలిపారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈసందర్భంగా కేటీఆర్ డిమాండ్ చేశారు. నిన్న హైకోర్టు హైడ్రా అనేది 9 తలల విష సర్పం అని చెప్పింది. ముఖ్యమంత్రి ఇంతకంటే చెంపపెట్టు ముఖ్యమంత్రికి ఏముంటుంది.. సిగ్గుండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేటీఆర్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ?

### పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై పొంగులేటి ఆరా

హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరా తీసారు.

సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దిని పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి అనంతరం వైద్యులతో మాట్లాడి అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి వారికి ధైర్యం చెప్పారు. అత్యుత్తమ వైద్య సేవలు అందుతున్నాయని, ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ:అంతర్జాతీయ, భౌగోళిక, రాజకీయ కారణాల నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. మంగళవారం పసిడి ధరలు భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,44,170గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1690 మేర తగ్గింది.. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,32,150గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాములకు రూ.1550 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు ఐదు వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,35,000గా ఉంది.

## నగరంలో భారీ వర్షం

హైదరాబాద్:గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయంలో వర్షం కురవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

హైడ్రా, డీఆర్ఎఫ్, జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కుండపోత వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్‌నగర్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, కోఠి, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట, ఎల్‌బీ నగర్, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అదే సమయంలో బేగంపేట్, సికింద్రాబాద్, మణికొండ, గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొంపల్లి, ఓల్డ్ సిటీ, అంబర్‌పేట్, కాచిగూడ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం పడటంతో రహదారులపై భారీగా నీరు నిలిచింది. పలుచోట్ల వాహనాలు ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి, ఉద్యోగులు, ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్లపై పడటంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, జీహెచ్ఎంసీ మాన్సూన్ ఎమ్జ్గ్ఞ÷న్సీ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. నీరు నిలిచిన ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించగా, వర్షం కొనసాగుతున్న నేపథ్యంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు.



## ప్రశ్నపత్రాల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్‌ను యూపీఎస్సీ విధానానికి అనుగుణంగా ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టడంతో పరీక్షల నిర్వహణలో పారదర్శకత సాధించామని సీఎం తెలిపారు. విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా పరీక్షలు నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడిన కొన్ని సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల అవి జాతీయ స్థాయి పరీక్షల వరకు ప్రభావం చూపాయని విమర్శిస్తూ, ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు అవసరమ న్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కొనసాగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ కాలానికి చెందిన బకాయిలు ఉన్నప్పటికీ వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజులను అదే సంవత్సరంలో పూర్తిగా చెల్లించే విధంగా ప్రణాళిక రూపొందించామని, అవసరమై న నిధులను ముందుగానే బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రూ.2,200 కోట్ల నుంచి రూ.2,400 కోట్ల వరకు ఈ పథకానికి అవసరమవుతాయని పేర్కొన్నారు. హైడ్రా కార్యకలాపాలపై కూడా ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తో ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. హైకోర్టు ఆదేశాలను ఇంకా పూర్తిగా పరిశీలించాల్సి ఉందని, ప్రభుత్వ స్థాయిలో సమీక్షించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. న్యాయస్థానాల ఆదేశాలను గౌరవిస్తూనే హైడ్రా చేపడుతున్న కార్యక్రమాలను ప్రజాహితం దృష్ట్యా భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## నెరేళ్ల బాధితులకు న్యాయం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని కోరారు. అవసరమైతే బాధిత కుటుంబాలతో కలిసి ఢిల్లీకి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తామని ప్రకటించారు. నెరేళ్ల బాధిత కుటుంబాలకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలే దని ఆమె ఆరోపించారు. మృతుడు గంధం గోపాల్ కుటుంబం తొమ్మిదేళ్ల పాటు ఆసుప త్రుల చుట్టూ తిరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలందరికీ కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై.రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు మానవత్వంతో స్పందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కవిత పిలుపునిచ్చారు. నెరేళ్ల ఘటనలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రక్షణ సేన ప్రజల హక్కుల పరిరక్షణ కోసమే ఏర్పాటైన సంస్థ అని కవిత తెలిపారు. నెరేళ్ల బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## రాష్ట్రపతిపై పుస్తకాల ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

భవన్ చరిత్ర, సంప్రదాయాలు, సేవా కార్యక్రమాలు, సమగ్ర భాగస్వామ్యం, భారతీయత విశిష్టతను ప్రతిబింబించే ఐదు ప్రచురణలను విడుదల చేశారు. వీటిలో రాష్ట్రపతి భవన్: రాష్ట్ర కా భవన్, సేవా ఔర్ సంవేదనా, సమావేషి సహభాగితా, భారతీ–యతా కా ఉత్సవ్, అలాగే ప్రముఖులు రచించిన వ్యాసాల ఒడియా సంకలనం 'అమ రాష్ట్రపతి –అమగౌరవ్' ఉన్నాయి. కార్యక్రమంలో మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఈ చిత్రాలతో కూడిన ప్రచురణలు రాష్ట్రపతి భవన్ సంప్రదాయాలు, నిర్వహణ విధానం, విభిన్న కోణాలను ప్రజలకు చేరువ చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ అత్యున్నత రాజ్యాంగ సంస్థ పనితీరుపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంలో ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ ప్రచురణల అసలు ప్రాధాన్యం దేశ వారసత్వంపై గర్వాన్ని పెంపొందించడంతో పాటు అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు పౌరులకు స్ఫూర్తినివ్వడంలో ఉందని రాష్ట్రపతి తెలిపారు. భారతీయ విలువలు, సాంస్కృతిక సంపదను భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి ప్రచురణలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. రాష్ట్రపతి భవన్ చరిత్ర, సేవా దృక్పథం, ప్రజలతో అనుబంధాన్ని ప్రతిబింబించే ఈ ప్రచురణలు పరిశోధకులు, విద్యార్థులు, సాధారణ పాఠకులకు ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.



## ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర సహకారం

మొదటి పేజీ తరువాయి

అదనపు పనులను చేర్చాలని ముఖ్యమంత్రి కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించడం తో పాటు పంటల వైవిధ్యీకరణకు తోడ్పడే పనుల ను చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక కేంద్రాలు, వెదురు వనాల అభివృద్ధి వంటి పనులను పథకంలో చేర్చాలని ప్రతిపాదించారు. కొండ ప్రాంతాలు, కొండ వాలుల్లో నీటి నిల్వ కందకాల నిర్మాణం, పండ్ల తోటల్లో తేమ సంరక్షణ పనులు, వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణకు అవసరమైన పనులను కూడా గ్రామీణ ఉపాధి కార్యక్రమంలో చేర్చాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ సమయంలో ఉపాధి హామీ పథకం తరహాలో 90 రోజుల పని అవకాశాన్ని కల్పించా లని కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణ ఉపాధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు రాష్ట్రానికి రావాలని శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. సమావేశంలో పలువురు తెలంగాణ ఎంపీలు, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రతి సమస్యను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల ను పరిశీలించిన మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రతి వినతిపై వేగంగా స్పందించాల ని సూచించారు. ప్రజలకు ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రెండు పడకగదుల గృహాలు, రెవెన్యూ, మున్సిపల్, సంక్షేమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రవాసి ప్రజావాణి ద్వారా విదేశాల్లో ఉపాధి, ఉద్యోగాలు, ఇతర కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రజల వినతులను కూడా మంత్రి పరిశీలించారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రవాసుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజావాణిలో ప్రతిరోజూ అందుతున్న వినతులు, వాటి పరిష్కార స్థితి, శాఖల వారీగా తీసుకుంటున్న చర్యలపై మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి వినతిని నిర్ణీత గడువులో పరిష్కరించాలని, పెండింగ్ ఫిర్యాదులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక మండలి ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి నోడల్ అధికారి విద్యాసాగర్‌లతో మంత్రి సమావేశమై ప్రజావాణి నిర్వహణ విధానం, సమస్యల పరిష్కార ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతికి పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

## రైతునే రాజుగా తీర్చిదిద్దే రైతునేస్తం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో నిరుపయోగంగా మారిన రైతువేదికలను వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాలతో ఆధునికీకరించి రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులు ఒకే వేదికపై ప్రత్యక్షంగా చర్చించుకునే అవకాశాన్ని కల్పించడం ద్వారా శాస్త్రీయ వ్యవసాయంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమని చెప్పారు. 2024 మార్చి 6న ప్రారంభమైన రైతునేస్తం నేటితో 100 ఎపిసోడ్లు పూర్తి చేసుకోవడం రైతుల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇప్పటివరకు 24,85,581 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొనగా, వారిలో 5,26,107 మంది మహిళా రైతులు ఉన్నారని తెలిపారు. రెండేళ్లలో 27 లక్షలకుపైగా రైతులు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందినట్లు వెల్లడించారు. ప్రతి మంగళవారం ఉదయం నిర్వహించే రైతునేస్తం ద్వారా రైతులు అడిగే ప్రశ్నలకు అదే సమయంలో శాస్త్రవేత్తలు సమాధానాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. దీనివల్ల పంటలకు సమస్యలు తలెత్తకముందే నివారణ చర్యలు తీసుకునే అవకాశం రైతులకు లభిస్తోందన్నారు. ప్రపంచ స్థాయి పోటీని ఎదుర్కొనే వ్యవసాయం కోసం సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని పేర్కొంటూ, వాతావరణ పరిస్థితులు,



మార్కెట్ అవసరాలు, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతునేస్తం ద్వారా వాతావరణ హెచ్చరికలు, జిల్లాల వారీగా అనువైన పంటలు, శాస్త్రీయ సాగు విధానాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎల్–నినో ప్రభావం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల ను ప్రభుత్వం, రైతులు కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో నీటి కొరత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే పంటల కంటే ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు, తక్కువ నీటితో సాగయ్యే పంటలను ప్రోత్సహించాలని సూచించారు.

## 500 స్పెషలిస్ట్ డాక్టర్ల ఫలితాలు విడుదల

**నాలుగు విభాగాల్లో నియామకాలకు తుది జాబితా ప్రకటింపు**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరత తగ్గింపే లక్ష్యం**

**మంత్రి దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్, జూలై 28 తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, రేడియాలజీ విభాగాలకు చెందిన మొత్తం 500 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల తుది ఫలితాలను విడుదల చేసింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యుల కొరతను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొత్తం 1,616 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ఇప్పటికే అనస్థీషియా, ప్రసూతి–స్త్రీరోగాలు, శిశువైద్యం, ఆర్థోపెడిక్స్ తదితర విభాగాలకు చెందిన 692 పోస్టుల భర్తీ పూర్తయ్యింది. ఎంపికైన వైద్యులకు నియామక పత్రాలు అందజేసి పోస్టింగులు కూడా ఇచ్చారు. తాజాగా విడుదలైన ఫలితాల్లో జనరల్ సర్జరీలో 174, జనరల్ మెడిసిన్‌లో 166, ఆర్థోపెడిక్స్‌లో 89, రేడియాలజీలో 71 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను ప్రకటించారు. ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి తుది ఎంపిక జాబితాను ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఎంపికైన



వైద్యులు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసి త్వరలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లో చేరనున్నట్లు అధికారులు తెలిపారు. స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులకు ఎంపికైన వైద్యులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజన ర్సింహ అభినందించారు. ప్రభుత్వ ఆసు పత్రులకు వచ్చే పేద, మధ్యతరగతి ప్రజల కు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 24 విభాగాల్లో భర్తీ చేస్తున్న 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల్లో ఇప్పటివరకు 1,192 పోస్టుల భర్తీ పూర్తయిందని, మిగిలిన పోస్టుల నియామక ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను ఆదేశించారు.

వేగుచుక్క

# దేశానికి “రైతులు, సైనికులు” రక్షకులు.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:




దేశానికి వెన్నుముక్క రైతు అయితే దేశ ప్రజలను దేశ సమైక్యతను సౌభ్రాతుత్వాన్ని చాటి చెప్పేది, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టేది సైనికుడని పలువురు వక్తలు కొనియాడారు.. అలాంటి అన్నదాతలను సైనికులను సన్మానించుకోవడం ఎంతో శుభ పరిణామం అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల మరియు టిఎంఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమాన్ని అలాగే కేంద్ర ప్రభుత్వం ఆదేశాల అనుసారం స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశభక్తిపై చైతన్య కార్యక్రమాలను పురస్కరించుకొని పలు కార్యక్రమాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.. ఇందులో భాగంగా మానసిక వికలాంగులకు యోగ మరియు డ్రాయింగ్ పెయింటింగ్ లందు పోటీలను అందులోకి పాటల పోటీలను నిర్వహించారు. టిఎంఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాటి వీరేశం వారి మనవడు తాటి స్తోత్ర కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.. స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.. అనంతరం సైనికులకు అలాగే రైతులను ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమం ద్వారా సైనికులను రైతులను ఘనంగా సన్మానించడం ఎంతో సంతోషకరమన్నారు. దేశానికి వెన్నుముక్క రైతు అయితే దేశ ప్రజలను దేశ సమైక్యతను సౌభ్రతత్వాన్ని చాటి చెప్పేది, దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెడుతూ సరిహద్దులో ధైర్యంగా నిలబడతారని తెలిపారు.. అలాంటి వారిని సన్మానించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు.. అలాగే స్నేహ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఇన్ని సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడులు ఎదుర్కొని దివ్యాంగ మానసిక విద్యార్థుల ఉన్నతీ కోసం స్నేహ సొసైటీ నిర్వాహకులు ఎస్ సిద్దయ్య ప్రిన్సిపాల్ జ్యోతి మరియు సిబ్బంది చేయడం ఎంతో అభినందనీయమన్నారు.. ఇప్పటివరకు ఎంతోమందిని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో నిలిపే స్థాయికి తీసుకురావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు.. ఇంకా చాలామంది దివ్యాంగ విద్యార్థుల్లో వెలుగులు నింపేందుకు నిరంతరంగా కృషి చేస్తుండడం వారి పట్టుదల ఆశయ సాధనకు చెప్పుకోదగ్గ విషయం అన్నారు.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా చేపట్టిన మానసిక దివ్యాంగ విద్యార్థులైనప్పటికీ కూడాను సైనికులకు వందనం రైతులకు నీరాజనం కార్యక్రమంతో పాటు స్నేహ సొసైటీ విద్యార్థులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన మరియు పాడిన పాటలు నృత్యాలు ఎంతో అద్భుతంగా ప్రదర్శించారని వారు తెలిపారు.. తమ వంతు బాధ్యతగా స్నేహ సొసైటీ దివ్యంగా విద్యార్థుల కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, జిల్లా విశ్రాంత సైనికుల సంఘం అధ్యక్షుడు సురహర ప్రసాద్, శ్రీ నూతన వైశ్య పాఠశాల అధ్యక్షుడు ఇంగు శివప్రసాద్, కార్యదర్శి, కొండ సత్య ప్రసాద్ మాజీ సైనికులు బాదావత్ రాజేందర్, రేకాజి రాజేశ్వర్, రైతులు అబ్బగోని గంగాధర్ గౌడ్ వరికూటి మాల కొండారెడ్డి, ఒంటిపల్లి శ్యామ్ కుమార్ లను స్నేహ సొసైటీ మరియు టిఎంఆర్ ఫౌండేషన్ ఘనంగా సన్మానించారు.



## ఐదుగురు బాలింతలు అస్వస్థతపై ప్రభుత్వం సీరియస్.

### ఇద్దరు నర్సులు సస్పెండ్, అనస్థీషియా డాక్టర్ విధుల నుంచి తొలగింపు.

వేగుచుక్క న్యూస్: బాన్సువాడ ఏరియా

ఆసుపత్రిలోని మాతా శిశు విభాగంలో జరిగిన నిర్లక్ష్యం వల్లే ఐదుగురు బాలింతలు అస్వస్థతకు గురయ్యారని ఉన్నత అధికారుల విచారణలో తేలింది. దీనితో ప్రభుత్వ ఘటనకు బాధ్యులుగా ఇద్దరు నర్సులను సస్పెండ్ చేయగా, అనస్థీషియా డాక్టర్ ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత 15 రోజుల క్రితం శుక్ర, శనివారాల్లో చేసిన 10 సిజెరియన్లలో 5గురు బాలింతలు ఆపరేషన్ అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టగా, వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని నిర్ధారించారు. విచారణ నివేదిక ప్రకారం శస్త్రచికిత్సా పరికరాలు, లినెన్ సరైన స్టెరిలైజేషన్ లేకపోవడం వల్ల కాలుష్యం జరిగే అధిక సంభావ్యత ఉందని, సెప్సిస్కు ఇదే ప్రధాన కారణమని స్పష్టమవుతోందని విచారణ లో తేలింది. ఆపరేషన్ థియేటర్లలో, శస్త్రచికిత్సలలో ఉపయోగించే వస్తువులలో కఠినమైన సెప్టిక్ పరిస్థితులను పాటించడంలో జరిగిన లోపంగా తేల్చారు.

**నిమ్స్ లో ప్రత్యేక బృందంతో చికిత్స...**

వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగు ఆదేశాలతో
ఇప్పటికే నిమ్స్
చికిత్స పొందుతున్న హుమేరా ఫాతిమా, రుక్సానా, జ్యోతితో పాటు మంగళవారం సాయంత్రం లక్ష్మి ప్రియ, సునీతలను నిజామాబాద్ నుంచి నిమ్స్ కు తరలించారు. ప్రస్తుతం వీరికి దయాలసిస్ చేస్తూ చికిత్స అందిస్తున్నారు.

**నిమ్స్ ప్రొఫెసర్లతో కారణాలపై విచారణ.**

ఒకేసారి 5గురు బాలింతలు ఒకే రకమైన సమస్యతో అస్వస్థతకు గురవడంపై ప్రిన్సిపల్ సెక్రటరీ సీరియస్గా స్పందించారు. కారణాలను కనుగొనేందుకు మంగళవారం ఇద్దరు ప్రొఫెసర్లను, డైరెక్టర్ ను నిమ్స్ కు పంపారు. వారు బాధితుల ఆరోగ్యాన్ని, వాడిన మందులు, శస్త్ర చికిత్స విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే బాన్సువాడకు వచ్చి ఇక్కడి ఆపరేషన్ థియేటర్ ను, సిజెరియన్ కు వాడిన పరికరాలను పరిశీలించారు. సిబ్బంది తో మాట్లాడారు. వివిధ మందులు, పరికరాలను ల్యాబ్ టెస్ట్ నిమిత్తం హైదరాబాద్ కు తీసుకెళ్లారు.

# న్యాయం కోసం... “ధూంధాం కళాకారుల నగారా”.

### అర్హులైన వారికి ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలనీ డిమాండ్.

### బోనాల జాతరతో వినూత్న నిరసన.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:ద







న్యాయం కోసం... “తెలంగాణ ధూంధాం కళాకారులు నగారా” మోగించారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. అమ్మవారి బోనాల జాతరతో వినూత్న నిరసన చేపట్టారు. తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మాక్లూర్ మండలంలోని ఓట్యాట్ పల్లి లో ఒడ్డేటవ్వ వద్ద బోనాలు సమర్పించారు.

ముందుగా గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి కళాకారులు పూల మాల వేశారు. కామన్ నుంచి డప్పు దరువులతో శివ సత్తుల, పోతరాజు నృత్యాలు చేస్తూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాకారులు తెలంగాణ ఉద్యమ పాటలతో ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా తెలంగాణ ధూంధాం నిజామాబాద్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు ఆర్టీసీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అష్ట గంగాధర్, కోశాధికారి రాంపూర్ సాయిలు మాట్లాడుతూ.. జిల్లా కళాకారుల ఐక్యత చాటేందుకు అమ్మ వారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం కోసం కష్టపడిన అర్హులైన అన్ని విభాగాల్లో ఉన్న కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలన్నారు. అన్ని నియోజకవర్గాలలో జిల్లా ధూంధాం కళాకారుల ఆధ్వర్యంలో త్వరలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**ఉపాధ్యక్షురాలు రేలారే రేలా గంగా మాట్లాడుతూ**

కళాకారులకు మంచి జరగాలని అమ్మ ఆశీర్వాదం కోసం బోనం సమర్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే ఇలాంటి కార్యక్రమం మొదటి సారి నిజామాబాద్ లో నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. అన్ని జిల్లాలు మా ఐక్యతను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.
తెలంగాణ ఉద్యమం కోసం అహర్నిశలు కష్టపడి పని చేసిన కళాకారులకు ఉద్యోగాలు, ఇండ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. తెలంగాణ వచ్చిన కళాకారుల జీవితాలు పూర్తిగా మారలేదని, ఎంతో దుర్భరంగా ఉన్నాయని గుర్తు చేశారు. వెంటనే ప్రభుత్వం కళాకారుల త్యాగాన్ని గుర్తించాలన్నారు. జిల్లా లోని కళాకారులు ఒక కుటుంబంగా ఒకే దగ్గర కలవడం ఉద్యమ సమయాన్ని గుర్తు చేశాయన్నారు. ఉద్యోగాల కోసం కళాకారులు వెయ్యి కండ్లతో ఎదిరి చూస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి అందించే సహాయం తొందరగా అందించాలని కోరారు. ఈ బోనాల కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గంగా, గోదావరి, సాయి లోవోల, సవిత, రాజేందర్ , సలహాదారులు పస్కా నర్సయ్య, పాశం కుమార్, బొడ్డెన్న యాదవ్, కోకిల నాగరాజు, సహాయ కార్యదర్శి కర్క రమేష్, క్రాంతి కుమార్, గోరకంటి రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్, ప్రశాంత్ రెడ్డి, మహేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు చిట్టిబాబు, మాదాసు గోపి, తోగరి నర్సయ్య, చిన్న రాజేందర్, రవి నాయక్, డప్పు సంతోష్, మనోజ, దివ్య, మానస, స్రవంతి, సమత, లత, శ్వేత జిల్లా ఉద్యమ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## సస్పెండ్ చేసిన నర్సులను విధుల్లోకి తీసుకోవాలి.

- తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ డిమాండ్.బాన్సువాడ ఆసుపత్రి వద్ద ధర్నా.

వేగుచుక్క న్యూస్, బాన్సువాడ:



అసత్య ఆరోపణలతో బాన్సువాడ మాతశిశు సంరక్షణ ఆస్పత్రి లో సస్పెండ్ చేసిన ఇద్దరు నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ నర్సెస్ అసోసియేషన్ నాయకులు ఆరోగ్య జ్యోతి, జూలియన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాన్సువాడ ప్రభుత్వ హాస్పిటల్ ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత పది సంవత్సరాల నుండి బాన్సువాడ ఆసుపత్రికి ఎంతో పేరు ప్రఖ్యాతలు వచ్చాయంటే ఇక్కడ పనిచేస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్ కృషి ఫలితంగానేనని అన్నారు. ఆపరేషన్ థియేటర్ లో అన్ని పరికరాలు బాగున్నాయని, అయిన కమిటీ నివేదిక పేరుతో ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్స్ ను సస్పెండ్ చేయడం దారుణమని అన్నారు. సస్పెండ్ చేసిన ఇద్దరు నర్సింగ్ ఆఫీసర్స్ ను బేషరతుగా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల పేరుతో మోసం..




### కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడి.

### ముగ్గురు నిందితుల అరెస్ట్.

వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ప్రభుత్వ సంక్షేమ పథకాలలో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా లబ్ధి పొందుతున్న ముఠాగుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు, కంప్యూటర్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, డిజిటల్ ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ చందారి సంతోష్ తన పేరుతో నకిలీ సంతకాలు చేసి, అధికారిక రబ్బరు ముద్రను దుర్వినియోగం చేస్తూ వయస్సు, మొదటి వివాహ ధ్రువీకరణ పత్రాలు రూపొందించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ మధుసూదన్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలతో విచారణ చేపట్టారు. భిక్కనూర్‌లోని లహరి జిరాక్స్ అండ్ ఆన్‌లైన్ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో ప్రధాన నిందితులు తోడెంగల రాజా నరేందర్, తోడెంగల రాజలింగం తమ ఆన్‌లైన్ కేంద్రం ద్వారా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల కోసం అవసరమైన పత్రాలు సేకరించి, ఒక్కో దరఖాస్తుకు రూ.4,500 నుంచి రూ.5,000 వరకు వసూలు
చేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న బోయిని ప్రసాద్‌తో కుమ్మక్కై ప్రభుత్వ వైద్యాధికారుల పేర్లతో నకిలీ సంతకాలు,
నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు ఉపయోగించి వయస్సు, మొదటి వివాహ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర పత్రాలను తయారు చేసి, వాటిని అసలు ప్రభుత్వ పత్రాలుగా చూపిస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించినట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు.

## అక్రమాల ద్వారా 32 మంది లబ్ధి.

అక్రమాల ద్వారా ఇప్పటివరకు 32 మంది ప్రభుత్వ పథకాల కింద లబ్ధి పొందినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. అక్రమంగా సమర్పించిన దరఖాస్తుల సంఖ్య, ప్రభుత్వానికి జరిగిన ఆర్థిక నష్టం, లబ్ధిదారుల వివరాలు, ఇతరుల ప్రమేయంపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. నిందితుల వద్ద నుంచి కంప్యూటర్ సీపీయూ, ఎల్‌సీడీ మానిటర్, కీబోర్డ్, మౌస్, మూడు మొబైల్ ఫోన్లు, నకిలీ అధికారిక రబ్బరు ముద్రలు, స్టాంప్ ప్యాడ్, నకిలీ సంతకాలకు ఉపయోగించిన పెన్నులు, డిజిటల్ రికార్డులు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అక్రమంగా వినియోగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించిన డీఎస్పీ మధుసూదన్, టౌన్ ఎస్‌హెచ్ఓ నరహరి, దర్యాప్తు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసిన ఎంపీ అర్వింద్.


- నిజామాబాద్ పార్లమెంట్ పరిధి రైల్వే ప్రాజెక్టులపై వినతి.

వేగుచుక్క న్యూస్, డిల్లీ:నిజామాబాద్



పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వేలకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై సమగ్రంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన పరిపాలనా, ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే నవీపేట రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని, అలాగే డిచ్‌పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కేంద్ర మంత్రిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే స్థానిక ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు గణనీయంగా తగ్గడంతో పాటు, రైల్వే క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలు నివారించబడి ప్రయాణ భద్రత మరింత మెరుగుపడుతుందని ఎంపీ వివరించారు. దీనిపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, ఇటీవల ఇందల్వాయి మరియు జానకంపేట వద్ద నూతన రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి ఎంపీ అర్వింద్ ధర్మపురి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల భద్రత మరియు రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు.

వేగుచుక్క






# లవ్ స్టోరీలు అంటే నాకు పిచ్చి: నాగ చైతన్య

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన సినిమా ' చెన్నై లవ్ స్టోరీ '. సాయి రాజేష్, ఎస్కేఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా.. బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లతో దూసుకుపోతోంది. 3 రోజుల్లోనే 40.1 కోట్ల రూపాయలు రాబట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్ లో గ్రాండ్ సక్సెస్ మీట్ నిర్వహించారు. దీనికి అక్కినేని నాగచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగచైతన్య మాట్లాడుతూ.. "ఈ ఈవెంట్ కు వచ్చినందుకు టీమంతా నాకు థ్యాంక్స్ చెబుతున్నారు. నాకు థ్యాంక్స్ చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సక్సెస్ ను సెలబ్రేట్ చేసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. 'చెన్నై లవ్ స్టోరీ' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ కు రమ్మని సాయి రాజేష్ కాల్ చేశాడు. నేను వేరే కమిట్మెంట్ వల్ల వెళ్లలేకపోయాను. అప్పుడు చాలా బాధపడ్డాను. ఈ సినిమా సక్సెస్ అయ్యాక కాదు, సక్సెస్ కు ముందే ఈ మూవీని ప్రమోట్ చేయాలని నా మనసులో ఉండేది. ఎందుకంటే నాకు పర్సనల్ గా లవ్ స్టోరీస్ అంటే పిచ్చి. కోవిడ్ తర్వాత లవ్ స్టోరీలు తగ్గిపోతుంటే ఒకానొక సమయంలో నాకు భయమేసింది. లవ్ సినిమాలు చూడటానికి ఆడియన్స్ థియేటర్లకు వెళ్తారా? అని ఆలోచించా. మెల్లిగా ఆ ట్రెండ్ మళ్లీ స్టార్ట్ అయింది. 'చెన్నై లవ్ స్టోరీ'తో ఇండస్ట్రీకి మరో కల్ట్ లవ్ స్టోరీ ఇచ్చారు. నాకు ఎంతో హ్యాపీగా ఉంది" అని అన్నారు.


# 'ఆదర్శ కుటుంబం'లో నివేదా పేతురాజ్

విక్టరీ వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ విడుదల చేసిన ప్రత్యేక గ్లింప్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. మొదట నివేదా పేతురాజ్ ఈ సినిమాలో స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఆ వార్తలకు చెక్ పెడుతూ మేకర్స్ విడుదల చేసిన గ్లింప్స్‌లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు స్పష్టం చేశారు. వీడియోలో వెంకటేశ్ సరదా డైలాగ్‌లతో ఆకట్టుకోగా, నివేదా చిరునవ్వుతో ఎంట్రీ ఇచ్చి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. గ్లింప్స్‌లో వెంకటేశ్ ఇంటి నుంచి కోపంగా బయటకు వచ్చి, నేటి మహిళలపై సరదాగా వ్యాఖ్యలు చేస్తారు. అదే సమయంలో ఎదురుగా నివేదా పేతురాజ్ నవ్వుతూ కనిపించడంతో, "ఆడది అంటే ఇలా నవ్వాలి" అంటూ తన భార్య గురించి వెంకటేశ్ చెప్పే కామెడీ డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. చివర్లో కమెడియన్ సత్య వచ్చి "ఊరుకో నాయనా.. ఇది మన ఆదర్శ కుటుంబం" అని చెప్పడంతో వీడియో ముగుస్తుంది. ఈ చిత్రంలో శ్రీనిధి స్వర్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్‌ను బట్టి చూస్తే నివేదా పేతురాజ్ పాత్రకు కూడా కథలో ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. వెంకటేశ్ కెరీర్‌లో ఇది 77వ చిత్రం కాగా, నారా రోహిత్ మరో ముఖ్యమైన పాత్రలో నటిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.




# 2:35 గంటల రన్‌టైంతో..

ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. "సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ" అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 'ఆర్ఎక్స్ 100' చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి.




# రిజర్వేషన్ పోస్ట్ ఫేక్

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నకిలీ పోస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోని రిజర్వేషన్ల వ్యవస్థపై తాను స్పందించినట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అదంతా పూర్తిగా కల్పితమని, దురుద్దేశంతో చేస్తున్న తప్పుడు ప్రచారమని ఆమె కొట్టిపారేశారు. ఇటువంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శిల్పాశెట్టి ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పోస్ట్ చేసినట్లుగా ఉన్న ఒక స్క్రీన్‌షాట్ ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. "జనరల్ కేటగిరీ వైద్యులు కేవలం జనరల్ కేటగిరీ రోగులకు మాత్రమే చికిత్స చేయాలి. ఇతర కులాల వైద్యులు వారి వారి కులాల వారికి మాత్రమే చికిత్స అందిస్తే, రిజర్వేషన్లు వద్దనే డిమాండ్ వస్తుంది. రిజర్వేషన్ ద్వారా నైపుణ్యం రాదు" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రచారంపై శిల్పాశెట్టి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చారు. "రిజర్వేషన్లపై నా పేరుతో ఇటువంటి తప్పుడు ప్రకటనలు వైరల్ కావడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. ఇది పూర్తిగా కల్పితం మరియు దురుద్దేశపూర్వక ప్రచారం. దయచేసి ఇటువంటి నకిలీ వార్తలను నమ్మకండి" అని ఆమె పోస్ట్ చేశారు. అయితే, సదరు పోస్టును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించి ఉండవచ్చని భావిస్తున్నారు.



# పావలా శ్యామల కన్నుమూత

ప్రముఖ సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటాక తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' చిత్రంతో వెండితెరకు పరిచయమైనప్పటికీ, కె. విశ్వనాథ్ దర్శకత్వంలోని 'స్వర్ణకమలం' సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత 'ఖడ్గం', 'ఆంధ్రావాలా', 'అతడు', 'గోలీమార్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో తనదైన సహజ నటనతో, కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించారు. ఏపీలోని గుంటూరు జిల్లా అమరావతిలో 1951లో జన్మించిన శ్యామల అసలు పేరు నేతి శ్యామల. నటనపై ఆసక్తితో తొలుత రంగస్థల నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు.



# ఐటెం సాంగ్‌లో కీర్తి సురేశ్

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం ది ప్యారడైజ్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇప్పుడు ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజా ప్రచారం ప్రకారం, ఈ చిత్రంలో ఉండే ఓ హై-వోల్టేజ్ మాస్ స్పెషల్ సాంగ్ కోసం జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్‌ను తీసుకోవాలని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ప్రచారం నిజమైతే నాని, కీర్తి సురేష్ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'నేను లోకల్' మంచి విజయాన్ని అందుకుంది. అనంతరం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన దసరాస లోనూ ఈ జంట మరోసారి ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఇప్పుడు అదే దర్శకుడు తెరకెక్కిస్తున్న ది ప్యారడైజ్ లో కీర్తి సురేష్ ప్రత్యేక గీతంలో కనిపించే అవకాశం ఉ ందనే వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పని చేస్తున్నారు. ఇప్పటికే ఆయన అందించిన పాటలు దేశవ్యాప్తంగా భారీ ఆదరణ పొందుతున్నాయి.